
హయత్‌నగర్‌లోని సీనియర్ సిటిజన్ల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

హయత్‌నగర్ సీనియర్ సిటిజన్ల సంఘం కార్యవర్గం

హయత్‌నగర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ సీనియర్ సిటిజన్ల సంఘం అధ్యక్షుడిగా హయత్‌నగర్‌కు చెందిన నక్క దర్శన్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో నక్క దర్శన్‌గౌడ్‌తో పాటు పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సహ అధ్యక్షుడిగా కళ్లెం శంకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా బోడ భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా నీరుడు సహదేవ్ ముదిరాజ్, కోశాధికారిగా కె. లక్ష్మయ్య ముదిరాజ్, సాంస్కృతిక కార్యదర్శిగా కేశవులు, ఉపాధ్యక్షులుగా రామ సత్తయ్యగౌడ్, పర్వత మల్లారెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్, టీఎస్‌దాసు, లక్ష్మణస్వామి, సంయుక్త కార్యదర్శులుగా గుమ్మి మధుసూదన్‌రెడ్డి, గోరంటి యాదయ్య, వెంకటప్పయ్యరెడ్డి, చంద్రయ్యగౌడ్, హమీద్, దేవ ముత్యాలు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా పిడుగు సుభాష్‌ముదిరాజ్, బు డిద నాగభూషనంగౌడ్, బి. రాంచందర్, రాజలింగం, బూరం భిక్షపతి, కొత్తురి విజయ్ కుమార్ ఎన్నికైనట్లు జిల్లా సీనియర్ సిటిజన్ల సంఘం ఇన్‌చార్జి అధ్యక్షుడు మూల సత్తయ్యగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ల సంఘం అధ్యక్షుడు నక్క దర్శన్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి సీనియర్ సిటిజన్లకు దక్కాల్సిన అవకాశాల కోసం పోరాటం చేస్తామని అన్నారు.


బంగారు మైసమ్మ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

వనస్థలిపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పద్మావతి కాలనీలోని బంగారు మైసమ్మ ఆలయ 11వ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. కార్పొరేటర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు అన్నారు. ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని ఆలయాల సందర్శనకు కేటాయించాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

దివ్యాంగ జంటకు ఉచితంగా వివాహ వేడుక

సైదాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రూపాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం సైదాబాద్ ఎస్‌బీహెచ్ కాలనీలోని శ్రీనివాసా కమ్యూనిటీ హాల్‌లో దివ్యాంగ జంటకు ఉచితంగా వివాహ వేడుకలు జరిపించారు. లలిత, సత్యనారాయణ జంటకు సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించారు. వేడుకలకు అతిథులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో రూపాయి ఫౌండేషన్ చైర్మన్ నాగమల్ల అనిల్‌కుమార్, అరుణ తదితరులు పాల్గొన్నారు.


రాజీవ్‌గాంధీ ఖేల్ ఉత్సవ్ రన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్

20న రాజీవ్‌గాంధీ ఖేల్ ఉత్సవ్ రన్

ఎల్‌బీనగర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆల్ ఇండియా రాజీవ్‌గాంధీ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఈ నెల 20న రాజీవ్‌గాంధీ ఖేల్ ఉత్సవ్ రన్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఎల్బీనగర్‌లో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ ఆవిష్కరించారు. ఈ రన్‌ను కొత్తపేట నుంచి సరూర్‌నగర్ స్టేడియం వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, స్పోర్ట్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు దొంతి వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ కోశాధికారి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు డేరంగుల కృష్ణ, గణేష్‌రెడ్డి, భీమిలి రామకృష్ణారెడ్డి, ఓరుగంటి నరేష్, గోపీరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కొండోజు శ్రీనివాస్, కారుకొండ శివకుమార్, సతీష్, నర్సింహ, జక్క సందీప్, జనార్దన్ కురుమ పాల్గొన్నారు.

79వ స్వాతంత్ర్య దినోత్సవం..
79 మంది సమరయోధుల చిత్రాలు


చిత్రకారుడు, కార్టూనిస్టు నాగార్జునపు రాము గీసిన 79మంది స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు

మన్సూరాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్బీనగర్‌కు చెందిన ప్రముఖ చిత్రకారుడు, కార్టూనిస్టు నాగార్జునపు రాము 79 మంది స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలను గీసి తన దేశ భక్తిని చాటుకున్నాడు. ఎల్బీనగర్‌లోని తన నివాసంలో గురువారం పెన్సిల్‌తో పేపరుపై జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య మొదలు నాటి దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పోరాటాలు చేసిన స్వాతంత్ర్య సిద్ధికి కారకులైన మహనీయుల చిత్రాలను గీసిన రాము దేశ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



జోనల్ కమిషనర్‌కు సమస్యలు విన్నవిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మిరెడ్డి

గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

చాదర్‌ఘాట్ : రాబోయే గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జీహెచ్ఎంసీ ద్వారా అన్ని రకాలుగా ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మిరెడ్డి జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని విన్నవించారు. మూసారాంబాగ్ డివిజన్‌లో వాడవాడలా గణేశ్ ఉత్సవ సమితి నిర్వాహకులు గణేశ్ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నందున ఇటీవలి వర్షాలకు అధ్వానంగా తయారైన రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేయించాలని కార్పొరేటర్ విజ్ఞప్తి చేశారు. డివిజన్‌లోని అనేక కాలనీలు, బస్తీల్లో వీధి దీపాలు వెలగడం లేదని, తక్షణమే వీధి దీపాలకు మరమ్మతులు చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కోరారు. గణేశ్ విగ్రహాలు తరలించే మార్గాల్లో చెట్లకొమ్మలు అడ్డుగా ఉన్నందున వాటి తొలగింపుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మలక్‌పేట సర్కిల్-6 డీసీ ఎంకేఐఅలీ, ఏఎంహెచ్‌వో డాక్టర్ రుద్ర శ్రీనివాస్, ఈఈ పీర్ సింగ్ పాల్గొన్నారు.

మిథిలానగర్‌లో ఎస్ఎన్‌డీపీ నాలాయే లేదు..!

- మొదటి దశలో పనులు చేపట్టకపోవడం వల్లనే ముంపు సమస్య
- కింద ఉన్న కాలనీని వదిలి ఎగువ కాలనీల్లో పనులు పూర్తి
- అధికారులు, పాలకుల అనాలోచిత నిర్ణయాలే ముంపునకు కారణం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బాధిత జనం


జలదిగ్బంధంలో మిథిలానగర్‌కాలనీ


వరద కాలువలా మారిన కాలనీ రోడ్లు

సరూర్‌నగర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): 1992లోనే హుడా అనుమతితో ఏర్పాటైన ఏకైక కాలనీ మిథిలానగర్‌కాలనీ! విశాలమైన రోడ్లు ఆ కాలనీకి ప్రత్యేక ఆకర్షణ.. కానీ నేడు ఆ విశాలమైన రోడ్లే వరద నీటిలో చిక్కుకుని బిక్కుబిక్కుమంటున్నాయి. దాదాపు 400 ప్లాట్లతో వెలిసిన అప్పటి జిల్లెలగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని మిథిలానగర్‌కాలనీ లేవుట్.. నేడు పూర్తిగా జనావాసాలతో నిండిపోయింది. అయితే వర్షం వచ్చిన ప్రతిసారీ ఇక్కడ వరద ముప్పు తప్పడం లేదు. ప్రస్తుతం మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న ఈ కాలనీ ఇక్కడి మంత్రాలచెరువుకు దిగువన ఉం టుంది. అంటే ఎప్పటికైనా దీనికి వరద ముప్పు తప్పదని తెలుసు. అయినా పాలకులు, అధికారులు ఈ కాలనీ ముంపు సమస్యపై ఎడతెగని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కాలనీలోకి వరద రాగానే హడావుడిగా ప్రజాప్రతినిధులు, అధికారులు గుంపులుగా అక్కడకు రావడం.. అలా చేయండి ఇలా చేయండి అంటూ ఆచరణకు నోచని సూచనలు, హామీలు ఇచ్చి వెళ్లిపోవడం షరా మామూలుగా మారింది. ప్రజాప్రతినిధులు అలా వెళ్లగానే అధికారులు సైతం తమ మానాన తాము వెళ్లిపోతున్నారే తప్ప సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టడం లేదు. దాంతో మిథిలానగర్‌కాలనీ దాదాపు రెండు దశాబ్దాలుగా ముంపు సమస్యను ఎదుర్కొంటూనే ఉన్నది.

ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణం ఎక్కడ..?

మీర్‌పేట్ పెద్దచెరువు నుంచి మంత్రాలచెరువు మీదుగా జిల్లెలగూడలోని చందచెరువు వరకు ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మించాలన్నది ప్రభుత్వ నిర్ణయం. అలాంటప్పుడు ముందుగా దిగువన ముంపు సమస్యను తీవ్రం గా ఎదుర్కొంటున్న మిథిలానగర్ కాలనీలోనే నాలా పనులు మొదలు పెట్టాల్సి ఉంటుంది. అలా చేస్తే సాంకేతికపరమైన ఇబ్బందులు(లెవెల్స్ సరిపోకపోవడం వంటి సమస్యలు) తలెత్తకుండా ఉంటాయి. అయితే అధికారులు, పాలకులు మాత్రం ఎగువన ముంపు సమస్య పెద్దగా లేని కాలనీల నుంచి ఎస్ఎన్‌డీపీ నాలా పనులు మొదలుపెట్టారు. దాంతో ప్రభుత్వం విడుదల చేసిన నిధులు అయిపోవడంతో మిథిలానగర్‌లో నాలా పనులకు దిక్కు లేకుండా పోయింది. ఎగువన గల అల్మాస్‌గూడ కోమటి కుంట నుంచి శ్రీబాలాజీకాలనీ, మీర్‌పేట్ పెద్దచెరువు, జనప్రియ మహానగర్, ఎంఎల్ఆర్‌కాలనీ మీదుగా మంత్రాలచెరువు దాకా నాలా నిర్మించారు. అందులోనూ అక్కడక్కడ కొన్ని పనులు అసంపూర్తిగానే మిగిలిపోయి ఉన్నాయి. ఈ నాలా నిర్మాణంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద ఒక్కసారిగా దిగువకు ప్రవహించి నాలా నిర్మాణం మొదలుపెట్టని మిథిలానగర్‌ను ముంచేస్తోంది. 80శాతం ఎస్ఎన్‌డీపీ నాలా పనులు పూర్తయ్యాయని, ప్రస్తుత ప్రభుత్వం నిధులు ఆపేయడంతోనే మిగతా పనులు పూర్తి చేయలేకపోతున్నామని ప్రజాప్రతినిధులు విమర్శిస్తున్నారు. అయితే అసలు మిథిలానగర్‌లో నాలా పనులు మొదలు పెట్టనేలేదని, తమ కాలనీని గాలికి వదిలేసి ఎగువ కాలనీలకు మేలు చేకూర్చేలా నాలా పనులు చేపట్టి నిధులు మొత్తం ఖర్చు చేశారని, తీరా తమ కాలనీకి వచ్చేసరికి నిధులు లేవంటూ సాకులు చెబుతున్నారని కాలనీ ముంపు బాధితులు ఆరోపిస్తున్నారు. మొదట్లోనే తమ కాలనీలో నాలా పనులు చేపట్టి ఉంటే తమకు ఈ ఇబ్బందులు ఉండకపోయేవని వారు వాపోతున్నారు.

> **వారం రోజులుగా 80శాతం కాలనీ జలదిగ్బంధంలోనే**
>
> మిథిలానగర్ కాలనీలో ప్రస్తుత పరిస్థితి దారుణంగా ఉంది. దాదాపు 80శాతం కాలనీ మొత్తం గత వారం రోజులుగా జలదిగ్బంధంలోనే చిక్కుకుపోయింది. ఇంట్లో ఉన్న వారు బయటకు, బయట ఉన్న వారు లోపలికి వెళ్ల లేని దుర్భర పరిస్థితి నెలకొంది. మునిసిపల్ అధికారులు, ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్టు అధికారులు, ఇతర విభాగాల అధికారులు ఇటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. కాలనీలోని వరద దిగువకు వెళ్లేమార్గం లేకపోవడంతో నివాస గృహాలు నీటిలోనే తేలియాడుతున్నాయి. గతంలో ఓ వరద కాలువ, అనంతరం ఓ ట్రంక్‌లైన్, ఆ తర్వాత ఎస్ఎన్‌డీపీ నాలా.. ఇలా రకరకాల ప్రకటనలతో పాలకులు స్థానికులను మభ్యపెట్టడం తప్ప శాశ్వత పరిష్కారం మాత్రం చూపలేకపోతున్నారని కాలనీ బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకరిపై ఒకరు రాజకీయ విమర్శలు చేసుకోవడం మాని తమ సమస్య పరిష్కారంపై అధికారులు, పాలకులు దృష్టి పెట్టాలని వారు కోరుతున్నారు.

బిహార్ నుంచి నగరానికి తుపాకులు తెచ్చి అమ్మే యత్నం

- పాత నేరస్థుడి అరెస్ట్, 3 తుపాకులు, 10 రౌండ్ల బుల్లెట్లు స్వాధీనం


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సుధీర్‌బాబు, అధికారులు

హైదరాబాద్ సిటీ/కొత్తపేట ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వస్తున్న ఆదాయం సరిపోకపోవడంతో బిహార్ నుంచి తుపాకులు తెచ్చి అసాంఘిక శక్తులకు అమ్మాలని ప్రయత్నించిన పాత నేరస్థుడిని మల్కాజిగిరి ఎస్ఓటీ, చర్లపల్లి పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి 3 దేశీవాళీ తుపాకులు, 10 రౌండ్ల బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఎల్బీనగర్ క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో సీపీ సుధీర్‌బాబు కేసు వివరాలు వెల్లడించారు. ఇప్పటి వరకు రాచకొండ పరిధిలో అక్రమ ఆయుధాలు విక్రయిస్తున్న వారిని అరెస్ట్ చేసి 7 తుపాకులను స్వాధీనం చేసుకున్నామని, ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న 3 తుపాకులతో మొత్తం 10 తుపాకులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. బిహార్ ఔరంగాబాద్ ప్రాంతానికి చెందిన శివ్ కుమార్ (32) పదోతరగతి వరకు చదువుకున్నాడు. ఇతడి తల్లిదండ్రులకు ఆరుగురు సంతానం కాగా ఇతడు పెద్ద కుమారుడు.. కుటుంబ పోషణ కోసం 2014లో సూరత్ వెళ్లి దుస్తుల కర్మాగారంలో పనిచేశాడు. పెళ్లి చేసుకున్న తర్వాత 2022లో నగరానికి మకాం మార్చాడు. మేడిపల్లి శ్రీకర పర్టిలైజర్స్ సంస్థలో హమాలీ (దినసరి కార్మికుడు)గా పనిచేస్తున్నాడు. వస్తున్న ఆదాయం సరిపోకపోవడంతో గతంలో బిహార్ నుంచి గంజాయి చాక్లెట్లు తెచ్చి నగరంలో విక్రయించడం ప్రారంభించాడు. చర్లపల్లి పోలీసులు ఇతడిని అరెస్ట్ చేసి, జైలుకు తరలించారు. జైలు నుంచి వచ్చిన ఇతడు తుపాకులు అమ్మితే డబ్బు సంపాదించవచ్చని భావించిన ఇతడు బిహార్ వెళ్లి, అతడి బంధువు కృష్ణ పవార్‌ను సంప్రదించాడు. అతడి సహకారంతో బిహార్ నుంచి మూడు తపంచాలు (కంట్రీమేడ్ తుపాకులు), 10 రౌండ్ల బుల్లెట్లు కొనుగోలు చేసి నగరానికి తీసుకువచ్చాడు. నగరంలో ఉన్న అసాంఘిక శక్తులకు తుపాకులు విక్రయించేందుకు చర్లపల్లి రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఎదురు చూస్తున్నాడు. తుపాకీ విక్రయంపై పక్కా సమాచారమందుకున్న మల్కాజిగిరి ఎస్ఓటీ, చర్లపల్లి పోలీసులు నిందితుడు శివ్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి 3 తపంచాలు, 10 రౌండ్ల బుల్లెట్లు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో ఎస్ఓటీ డీసీపీ ఏ. రమణారెడ్డి, ఏడీసీపీ ఎన్ నర్సింహారెడ్డి, ఏసీపీ అంజయ్యతో పాటు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న తుపాకులను పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు

మూసీ పరీవాహక ప్రాంతాల్లో భద్రతా చర్యలు

ఇటీవల కురిసిన వర్షాలకు మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోందని, మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఉన్న పౌరులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సీపీ సుధీర్‌బాబు సూచించారు. సీఎం ఆదేశాల మేరకు మూసీ పరీవాహక ప్రాతాల్లో నిరంతరం గస్తీ నిర్వహిస్తూ, ఎప్పటి కప్పుడు సమాచారం సేకరిస్తున్నామన్నారు. నిరంతరం నిఘా పెడుతూ ప్రజా భద్రతకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

భవన నిర్మాణ కార్మికులు లేబర్ ఇన్సూరెన్స్ కార్డు తీసుకోవాలి


ఎల్బీనగర్ భవన నిర్మాణ కార్మిక యూనియన్ సమావేశంలో సీఐటీయూ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, ఇతర నేతలు

ఎల్‌బీనగర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులు లేబర్ ఇన్సూరెన్స్ కార్డు తీసుకోవాలని సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య సూచించారు. ఎల్బీనగర్ లేబర్ అడ్డాలో ఎల్బీనగర్ భవన నిర్మాణ కార్మిక యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ఐక్యంగా నిలవాలన్నారు. అర్హులైన ప్రతి కార్మికుడు లేబర్ ఇన్సూరెన్స్ తీసుకుంటే లేబర్ బోర్డు నుండి సంక్షేమ పథకాలు వస్తాయన్నారు. ప్రమాదం జరిగి చనిపోతే రూ.6.30 లక్షలు, సహజ మరణం అయితే రూ. 1.30 లక్షలు, మొదటి కాన్పుకు రూ.30వేలు, రెండో కాన్పుకు రూ.30వేలు, ఆడపిల్ల పెళ్లి కానుక రూ.30వేలు లేబర్ బోర్డు నుంచి కార్మికులకు వస్తాయన్నారు. అందుకోసం ప్రతి కార్మికుడు తప్పనిసరిగా లేబర్ ఇన్సూరెన్స్ కార్డు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం కార్మిక బోర్డు ద్వారా అందించే పథకాల గురించి కార్మికులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లాట్ల లక్ష్మణ్, కార్యదర్శిగా శేఖర్, ఉపాధ్యక్షులుగా ఎస్ కే బాషా, సైదులు, సహకార్యదర్శిగా నాగయ్య, శేఖర్, ఎన్నికయ్యారు. ఎల్బీనగర్ ఆర్గనైజర్లు సైదులు, జయమ్మ, బొడ్డు జయమ్మ, కమిటీ సభ్యులు రమావత్ చిట్టి, ప్రవీణ్, బోనాల సైదులు, శ్రీను, లక్ష్మయ్య, రమేష్, ఆలేటి లచ్చయ్య, రమణ, బాష, పిచ్చయ్య పాల్గొన్నారు.

మూసారాంబాగ్ బ్రిడ్జిని ముంచెత్తిన వరద

- మూసానగర్ బస్తీలోని 27 ఇళ్లు మునక
- బాధితులకు కమ్యూనిటీహాల్‌లోనే పునరావాసం
- ఎమ్మెల్యే అహ్మద్ బలాల సందర్శన
- బాధితుల వివరాలను సేకరించిన ఆర్డీఓ రామకృష్ణ


మూసానగర్ బస్తీలో వరద బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

చాదర్‌ఘాట్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): హిమాయత్ సాగర్ నుంచి 11 గేట్లను ఎత్తడంతో మూసీలో వరద ఉప్పొంగి ప్రవహిస్తుంది. గురువారం మధ్యాహ్నం 2గంటల నుంచి మూసీలో వరద ప్రవాహం క్రమంగా పెరగడం మొదలైంది. అప్పటికే చాదర్‌ఘాట్‌లోని మూసానగర్ బస్తీ వాసులను హిమాయత్‌నగర్, అంబర్‌పేట మండలాల తహసీల్దార్లు సంధ్యారాణి, అన్వర్‌లతో కూడిన రెవెన్యూ సిబ్బంది, జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 డీసీ ఎంకేఐఅలీతో కూడిన బృందం అప్రమత్తం చేసేందుకు చర్యలు చేపట్టింది. అప్పటికే మూసానగర్‌లోని ఇళ్ల ముందుకు వరద ప్రవాహం రావడం మొదలైంది. మూసానగర్ బస్తీలోని 27 ఇళ్లను వరద ప్రవాహం ముంచెత్తింది. విషయం తెలుసుకున్న మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, హైదరాబాద్ ఆర్డీవో రామకృష్ణ, మూసానగర్ బస్తీని సందర్శించారు. వరద బాధితులకు అండగా ఉంటామని, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని విజ్ఞప్తి చేశారు. మూసానగర్ బస్తీలోని వరద బాధిత కుటుంబీకుల కోసం అదే బస్తీలో ఉన్న కమ్యూనిటీహాల్‌లో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 డీసీ ఎంకేఐ అలీ తెలిపారు. చాదర్‌ఘాట్ పోలీసులు, జీహెచ్ఎంసీ, హైడ్రా సిబ్బంది మూసానగర్ బస్తీలోని వరద బాధితులను తరలించేందుకు చర్యలు చేపట్టారు.

ధోబీఘాట్ వరదమయం

ఉప్పొంగి ప్రవహిస్తున్న మూసీ వరద ప్రవాహం మూసారాంబాగ్ బ్రిడ్జిని ముంచెత్తింది. మూసారాంబాగ్ బ్రిడ్జిపై క్రమంగా వరద ప్రవాహం పెరుగుతున్న సమయంలోనే వాహనాల రాకపోకలను నిలిపివేసినట్లు మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. మూసారాంబాగ్ బ్రిడ్జిని ముంచెత్తడంతోపాటు బ్రిడ్జికి సమీపంలో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులోకి వరదనీరు ప్రవేశిస్తుండడంతో బంకు తాత్కాలికంగా మూసివేశారు. దీనితో పాటు మూసీ సమాంతర రోడ్డుకు మూసారాంబాగ్ బ్రిడ్జికి వెళ్లే మార్గం కూడా మూతపడింది. మూసీ ఒడ్డునున్న ధోబీ ఘాట్ పూర్తిగా వరద మయమైంది.


చాదర్‌ఘాట్ బ్రిడ్జి కింద మూసీ వరదలో మునిగిన ఇళ్లు


మూసానగర్ బస్తీలో వరద బాధితుల సహాయార్థం రంగంలోకి దిగిన చాదర్‌ఘాట్ పోలీసులు, హైడ్రా సిబ్బంది


మూసానగర్ బస్తీలో వరద బాధితుల వివరాలను సేకరిస్తున్న హైదరాబాద్ ఆర్డీఓ రామకృష్ణ, అంబర్‌పేట్ తహసీల్దార్ అన్వర్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

వనస్థలిపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం రాత్రి మన్సూరాబాద్‌లో వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ టి.మహేష్ ఆధ్వర్యంలో విజుబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీలు నిర్వహించి వాహనదారులకు ట్రాఫిక్, సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ ప్రవీణ్‌కుమార్, వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డితో కలిసి మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు గిరీష్, రవికుమార్, అనిల్, నాగరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

వనస్థలిపురం : ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్‌కు చెందిన దమాయి కృష్ణ(33) భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి వనస్థలిపురంలోని సుష్మా సమీపంలో ఫాస్ట్ ఫుడ్ విధులు నిర్వహిస్తు జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కొంతకాలంగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో సరైన పనులు లేకపోవడంతో కృష్ణ తీవ్ర మనస్థాపానికి గురైనాడు. దీంతో బుధవారం అర్ధరాత్రి ఇంజాపూర్ పాత గ్రామంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలోని తుమ్మ చెట్టుకు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

వనస్థలిపురం : హాస్టల్లో ఉంటు విద్యను అభ్యసిస్తున్న వివాహిత అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలం ఇందోలు గ్రామానికి చెందిన బోయిని రమేష్‌కు గత 2023లో ఇదే ప్రాంతానికి చెందిన ప్రమీలతో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. కాగా తనకు చదువుకోవాలని ఉందని భర్త రమేష్‌కు ప్రమీల చెప్పడంతో మన్సూరాబాద్‌లోని జ్ఞానేశ్వరి ప్రవేట్ హాస్టల్లో ఉంటుంది. ఈ క్రమంలో ప్రమీలకు భర్త రమేష్ గురువారం పలుమార్లు ఫోన్ చేశాడు. ఎంతకి ప్రమీల ఫోన్ ఎత్తకపోవడంతో అనుమానం వచ్చిన రమేష్ హాస్టల్‌కు వచ్చి చూడగ ప్రమీల హాస్టల్లో కనిపించలేదు. దీంతో ప్రమీల ఆచూకీ ఎంతకి లభించకపోవడంతో చేసేది లేక రమేష్ వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.4కోట్లతో వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు : లక్ష్మీశ్రీనివాస్

ఓల్డ్‌మలక్‌పేట: మలక్‌పేటలోని హైదరాబాద్ జాతీయ వ్యవసాయ మార్కెట్‌లో పలు అభివృద్ధి పనులకు రూ.4కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చెకొలేకర్ లక్ష్మీ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆమె వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో మార్కెట్‌ను అన్నివిధాల అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. మార్కెట్‌లో పంట విక్రయాలు జరిపే షెడ్ల మరమ్మతులకు రూ.40లక్షలు మంజూరయ్యాయి. త్వరలోనే టెండర్లు ఖరారు చేసి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. మార్కెట్‌లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ, వరద కాలువ నిర్మాణం, నలువైపులా సీసీ కెమెరాలు, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.